సొంతింటి కల సాకారం.. జగనన్న లక్ష్యం

- లబ్ధిదారులకు 794 ఇళ్ల పట్టాల పంపిణీ
- మండలంలోఎమ్మెల్యే జగ్గిరెడ్డి విస్తృత పర్యటన


చింతలూరులో అర్హులైన మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: అర్హులైన మహిళలందరికి సొంతింటి కల నిజం చేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారనేందుకు నియోజకవర్గ స్థాయిలో 17,594 మందికి ఇళ్ల పట్టాలను అందజేసి కాలనీలు నిర్మిస్తుండటమే ప్రత్యక్ష నిదర్శనమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, పార్టీ నేత పెంటపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన మండలంలోని మోదుకూరు, చింతలూరు, సంధిపూడిలో గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించి అర్హులైన 794 మంది లబ్ధిదారులకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, తాంబూలాలతో సత్కరించి మంజూరు చేసిన స్థలాల వద్దకు తీసుకువెళ్లి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు పెంటపాటి శ్యామల, మార్గని కరుణ, తోట భవాని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక ప్రతి గ్రామంలోనూ ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఆ మేరకు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లను నిర్మించి మహిళందరికీ ఆడపడుచు కట్నంగా సీఎం జగన్ రూ.లక్షల విలువైన ఆస్తిని సీఎం జగన్ సమకూర్చుతున్నారని ఆయన కొనియాడారు. పేదల కోసం నిర్మించబోయే కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించి మహిళలకు విలువైన ఇళ్లను నిర్మిస్తున్నామనేందుకు ఆలమూరులోని వైఎస్సార్ జగనన్న (యర్ర) కాలనీయే నిదర్శనమన్నారు.

ప్రజాభ్యుదయానికి, పేదరిక నిర్మూలనకు, మహిళా సాధికారతకు తీవ్రంగా శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలోని చింతలూరులో రూ.1.60 కోట్లతో జరుగుతున్న నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగబోయే తీర్థోత్సవాలకు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. జరుగుతున్న పనులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, నల్లి రాజు, పోలాబత్తుల చిన్న, తోరాటి గోవిందు, ఆకుల రామకృష్ణ, ఎంపీటీసీ చుండ్రు సునీత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే బలహీన వర్గాల అభ్యున్నతి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- టీడీపీ నుంచి 100 మంది వైఎస్సార్ సీపీలో చేరిక


వానపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభ్యున్నతి సాధించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వాసంశెట్టి శ్రీను, మహాలక్ష్మి, అర్జునరావు, వెంకటలక్ష్మి, యేసునారాయణ, నాగవేణి, ధనచక్రవర్తి, సత్యనారాయణ, గుబ్బల శ్రీను, బొక్కా విజయలక్ష్మి, రాయుడు నరసింహారావు, తులసి, సానబోయిన దుర్గారావు, వెంకటలక్ష్మి, అనసూయ, దంగేటి సాయి, దుర్గాప్రసాద్, చప్పిడి లక్ష్మీనారాయణతో సహా సుమారు 100 మంది సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని గుర్తించి ఆ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీలా మేము బీసీలను వాడుకుని వదిలేయలేదని నియోజకవర్గంలో రెండు ఏఎంసీ చైర్మన్ పదవులను శెట్టిబలిజ సామాజిక వర్గానికి కట్టబెట్టామన్నారు. రాబోయే రోజుల్లో జగన్ ప్రభుత్వానికి అన్ని వర్గాలు అండగా నిలవాలని కోరారు.

గ్రామంలో గడప గడపకూ..

వానపల్లి సాంబశివపేట తదితర శివారు గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, పలువురు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జగ్గిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వీధి వీధినా జనం ఆయన పట్ల అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ, వివిధ విభాగాల సభ్యులు ఇసుకపట్ల సునీల్, వనుము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే.. ప్రభుత్వ లక్ష్యం


మోదుకూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ మండలంలోని మోదుకూరులో శనివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ పెంటపాటి శ్యామల, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లి రాజు, ఎంపీటీసీ చుండ్రు సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ కార్యదీక్షతో ముందుకు సాగారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల కోవిడ్ సమయంలో ప్రజలకు కలిగిన మేలును, వలంటీర్లు అందించిన సేవలను ప్రజలకు తెలియజేశారు. పేద ప్రజల అభ్యున్నతికి శ్రమిస్తున్న సీఎం జగన్‌కు రాబోయే ఎన్నికల్లో అందరూ మద్దతు పలకాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నవరత్న పథకాల వల్ల రికార్డు స్థాయిలో రూ.11.28 కోట్ల లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని నర్సిపూడిలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి భూమి పూజ చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఆయన వివరించారు. అనంతరం రూ.కోటితో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, ఆకుల రామకృష్ణ, పెంటపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే ఇంటింటికీ కుళాయి సాధ్యం


కత్తిమండలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ఇంటింటికీ తాగునీటి పైప్‌లైన్, కుళాయి సాధ్యమైందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని కత్తిమండలో నూతనంగా నిర్మించనున్న తాగునీటి ట్యాంకు పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం నియోజకవర్గంలోని గ్రామాలకు వరం లాంటిదని అన్నారు. ప్రతి కుటుంబానికీ తాగునీటి అవసరాలను తీరుస్తున్నట్లు చెప్పారు. వచ్చే వేసవి నుంచే తాగునీటి సమస్యలకు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ చిట్టాల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ పెమ్మాడి సోమరాజు, కర్రి వెంకట్రావు, అల్లూరి సూరిబాబు రాజు, కార్యదర్శి ఇంజేటి శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామీణ క్రీడలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గ్రామ సచివాలయ స్థాయిలో శనివారం ముగిసింది. ఒక్కో గ్రామ సచివాలయం నుంచి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్టును మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. దీంతో మండల స్థాయిలో సుమారు 120 జట్లు తలపడనున్నట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందడమే లక్ష్యంగా విద్యార్థులు, యువతీ యువకులు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: అమలాపురం నుంచి వయా వక్కలంక మీదుగా రావులపాలెం వరకు ఆర్టీసీ బస్ సర్వీసును ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు వక్కలంక వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి పెదబాబు ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ముక్కామల, వయా వక్కలంక, గొలకోటి వారిపాలెం తదితర గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్ సర్వీసు లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విశ్వరూప్‌కు వివరించారు. మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో పెదబాబుతో పాటు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు భిక్ష

అంబాజీపేట: చిరతపూడికి చెందిన విజయదుర్గా భవానీల పీఠం ఆధ్వర్యంలో గురుభవాని కేతా దొరబాబు పర్యవేక్షణలో విజయవాడ దుర్గమ్మ ఆలయానికి మాలవిరమణకు పాదయాత్రలో వెళుతున్న భవానీలకు శనివారం భిక్ష పంపిణీ చేశారు. సుమారు 200 మంది భవానీలకు భోజనం, మంచినీరు అందిస్తున్నట్లు భవానీలు తెలిపారు. చిరతపూడి, కొత్తపేట, రావులపాలెం, సిద్ధాంతం తదితర ప్రధాన రహదారుల వెళుతున్న పాదయాత్ర భవానీలకు అందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అంబాజీపేట: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డిసెంబర్ 31 రాత్రి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఎ.చైతన్యకుమార్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని ఎస్సై విలేకరులకు శనివారం వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మండలంలోని పలు ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నామన్నారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని యువతకు సూచించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఆలమూరు: విద్యార్థులు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు వారందరికీ ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు బొబ్బా జయశ్రీ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాడు–నేడు కింద రూ.కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించామన్నారు. మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి 594 మంది విద్యార్థులకు 594 ట్యాబ్‌లు మంజూరు కాగా తొలివిడగా 290 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆయన అందజేశారు. అనంతరం యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. విద్యార్థినుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు సమకూర్చిన కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ప్రారంభించారు. అలాగే స్థానిక పెద్దకాలువ రోడ్డులో ఎస్టీయూ నూతన భవనానికి ఆయన భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వైట్ల సత్యనారాయణమూర్తి, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, దొండపాటి చంటి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఎంఈఓలు పి.షాలెంరాజు, ఎస్‌వీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులకు సేవలే గుర్తింపు


అంబాజీపేటలో తహసీల్దార్ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీవో ముక్కంటి

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ప్రజల కోసం కష్టపడి పనిచేసే వారే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి అధ్యక్షతన తహసీల్దార్ టి.మంగతాయారు ఉద్యోగ విరమణ సన్మాన సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సేవలందించి, వారికి అండగా నిలిచిన మంగతాయారు సేవలు మరువలేనివన్నారు. అనంతరం మంగతాయారు, రామారావు దంపతులను రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రేవంత్‌కుమార్ రెడ్డి


నిర్వాహకుల నుంచి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకుంటున్న రేవంత్‌కుమార్‌రెడ్డి, తల్లిదండ్రులు

రావులపాలెం: పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందంగా రావులపాలేనికి చెందిన రెండేళ్ల చిన్నారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. ఈ వివరాలను చిన్నారి తల్లిదండ్రులు కొవ్వూరి వీర వెంకట సత్య సూర్యనారాయణ రెడ్డి, ఆదిమహాలక్ష్మి దంపతులు శనివారం వెల్లడించారు. తమ చిన్నారి రేవంత్‌కుమార్ రెడ్డి అతి చిన్న వయసులో (రెండు సంవత్సరాల రెండు నెలలు) 250కు పైగా ఫ్లాష్ కార్డ్స్‌ను అవలీలగా గుర్తించి చెబుతున్నాడని దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు పరీక్షించి రికార్డును నమోదు చేశారన్నారు. ఈనెల 29న రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, ఉభయ ఉమ్మడిగోదావరి చీఫ్ కోఆర్డినేటర్ రాయుడు చంద్రకుమార్, స్థానిక బ్రాంచ్ ఇంచార్జి ఆర్ఎస్ రావు, కోఆర్డినేటర్ ఆదిత్య ప్రసాద్ చేతుల మీదుగా చిన్నారికి గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందించి, బ్యాడ్జి నిచ్చి అభినందనలు తెలిపారన్నారు. కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామ స్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఈసందర్భంగా ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువు వేంకటేశ్వరస్వామికి పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. స్వామిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

కేశవస్వామికి లక్షతులసి పూజ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన శ్రీ, భూ సమేత కేశవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి కృష్ణమాచార్యులు, రాధాకృష్ణ సత్యగణేష్ ఆధ్వర్యంలో లక్షతులసి పూజ నిర్వహించారు. తెల్లవారుజామున అయిదు గంటల నుంచి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, లక్ష తులసి దళాలతోను, చామంతి పుష్పాలతోను సహస్ర నామార్చన నిర్వహించారు. శాంతి కల్యాణం జరిపారు. స్వామికి బాలభోగం సమర్పించారు. అమ్మవార్లకు అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు నిర్వహించారు.

ఘనంగా భవానీ 18 కలశాల పూజ

రాజోలు: భవానీ 18 కలశల పూజ శనివారం రాజోలులోని కొత్త వేంకటేశ్వరస్వామి ఆలయ వీధిలో ఘనంగా నిర్వహించారు. రాజోలుకు చెందిన రాయమట్ల సురేష్, దుర్గ, భవానీ మాలధారుడైన వారి కుమారుడు సిద్దూ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కలశల పూజ పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భజన భక్తులను ఆకట్టుకుంది. రాజోలు, శివకోడు, పాదలాడ తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భవానీ మాల ధారులు పూజలో పాల్గొన్నారు. అమ్మ వారి పూజ అనంతరం ప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్ సీపీ విజయం దిశగా అడుగులు


రాజోలు మండల కమిటీ నాయకులతో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: వైఎస్సార్ సీపీ నూతన సంస్థాగత కమిటీలతో విజయం దిశగా అడుగులు వేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కార్యకర్తలకు సూచించారు. శనివారం రాజోలు మండల వైఎస్సార్ సీపీ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కట్టా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా చెల్లింగి లక్ష్మీఈశ్వరి, గెడ్డం సురేష్, ప్రధాన కార్యదర్శిగా మట్టా ఏడుకొండలు, కార్యవర్గ సభ్యులను నియమించారు.

ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలపాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు కలసికట్టుగా పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, సర్పంచ్ రేవు జ్యోతి, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, దార్ల పెదబాబు, బండారు కాశీ, అడబాల జానకీరామ్, కొప్పాడి దుర్గారావు, మంచికంటి బోస్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య కళాకారిణికి అభినందన


కొత్తపేటలో సత్యవాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ సంప్రదాయ నృత్య, కళా రంగాల్లో రాణించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ఈ నెల 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి వైభవం మహాబృంద నాట్యం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. ఆ ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది.

ఆ ప్రదర్శనలో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ఫస్టియర్ విద్యార్థిని రావి సత్యవాణి పాల్గొని తెలంగాణ రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమెంటో అందుకుంది. శనివారం సాయంత్రం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సత్యవాణి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ఎంతో ఇష్టమైంది కూచిపూడి నృత్యం అని అన్నారు. కూచిపూడి నృత్య రూపకం గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కడం, ఆ ప్రదర్శనలో మన కళాశాల విద్యార్థిని సత్యవాణి ఉండటం కళాశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొంటూ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు సత్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

వచ్చే నెల 27, 28 తేదీల్లో కళాప్రదర్శనలు

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం విజేత స్కూల్ ఆడిటోరియంలో వచ్చే నెల 27, 28 తేదీల్లో కళాకారుల ప్రోత్సాహం నిమిత్తం రంగస్థల కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శనివారం వీవీమెరకలో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించే వీటి బ్రోచర్‌ను ప్రతాప్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక కళాకారులతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ఏరియాలకు చెందిన కళాకారులు పాల్గొంటారన్నారు. కళాకారులందరికీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. అసోసియేషన్ కార్యవర్గ మెంబర్స్ డాక్టర్ కొల్లాబత్తుల జాషువా, కడలి కృష్ణారావు, అల్లూరి జానకి రామరాజు, మోరం నాయుడు, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు శాంతి, సహనం అందరికీ ఆదర్శం


నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపేట: లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం సమాజంలో అందరికీ ఆదర్శం కావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. క్రిస్మస్ మాసం సందర్భంగా అంతర్జాతీయ ప్రవచన దేవుని సంఘం కొత్తపేట యెరూషలెం చర్చ్ పాస్టర్, రీజినల్ ఓవర్ సీర్ బిషప్ జి.అబెద్నగో అండ్ గ్రేస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని పేద, మధ్యతరగతి ప్రజల ఇంటికే పంపి వైద్యం చేయిస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం కల్పించి గౌరవిస్తున్నారన్నారు. అనంతరం కేండిల్ సర్వీస్ కార్యక్రమం కనువిందు చేసింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ నేలపూడి భీమరాజు, మండల సేవాదళ్ అధ్యక్షుడు జి.ప్రవీణ్‌కుమార్, స్థానిక మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజాబాబు, ఇవాంజిలికల్ పాస్టర్స్, ఫెలోషిప్ సభ్యులు, అత్యధిక సంఖ్యలో క్రీస్తు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

రాజోలు: ఏసుక్రీస్తు బోధనలతో సేవాభావం పెంపొందుతుందని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. శనివారం శివకోడులోని వైఎస్సార్ సీపీ నాయకుడు స్టూడియో వర్మ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీలు మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, బల్ల ప్రసన్నలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. వర్మ కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన 200 మంది వృద్ధులు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే సుమారు 600 మందికి క్రిస్మస్ భోజనాలు ఏర్పాటు చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు జంపన బుజ్జిరాజు, తెన్నేటి కిషోర్, బొమ్మిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల వైఎస్సార్ సీపీ రథసారథులు వీరే..


ముత్యాల వీరభద్ర రావు (కొత్తపేట)


దొమ్మేటి అర్జునరావు (రావులపాలెం)


నక్కా చినవెంకటేశ్వరరావు (పి.గన్నవరం)


కొమ్ముల రామచంద్ర రావు (మామిడికుదురు)


కనుమూరి శ్రీనివాస రాజు (ఆత్రేయపురం)


తమ్మన శ్రీనివాస్ (ఆలమూరు)


వాసంశెట్టి చిన బాబు (అంబాజీపేట)


కుడుపూడి విద్యా సాగర్ (అయినవిల్లి)

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల శాఖల కార్యవర్గాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఆ మేరకు కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని మండల సారథుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలానికి పార్టీ ప్రెసిడెంట్‌గా ముత్యాల వీరభద్రరావు, వైస్ ప్రెసిడెంట్‌గా యడ్ల కృష్ణమూర్తి, ముగ్గురు ప్రధాన కార్యదర్శులతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. రావులపాలెం మండల పార్టీ ప్రెసిడెంట్‌గా దొమ్మేటి అర్జునరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పడాల పరమేశ్వరరెడ్డి, ముగ్గురు ప్రధాన కార్యదర్శులతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. ఆత్రేయపురం మండలానికి పార్టీ ప్రెసిడెంట్‌గా కనుమూరి శ్రీనివాస రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా పాలా నాగేశ్వరరావు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. ఆలమూరు మండలానికి పార్టీ ప్రెసిడెంట్‌గా తమ్మన శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా నల్లి రాజు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

పి.గన్నవరం నియోజకవర్గం..

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీలను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. పి.గన్నవరం మండల కమిటీ అధ్యక్షుడిగా నక్కా చిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా దొమ్మేటి దుర్గారావు, బండి రమేష్‌బాబు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులుగా, మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

అలాగే మామిడికుదురు మండల కమిటీ అధ్యక్షుడిగా కొమ్ముల రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా ఉండ్రు వీవీ సత్యనారాయణ, చిట్టూరి రామకృష్ణ, అంబాజీపేట మండల కమిటీ అధ్యక్షుడిగా వాసంశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు (చినబాబు), ఉపాధ్యక్షులుగా నాగవరపు నాగరాజు, సూదాబత్తుల రాము, అయినవిల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా కుడుపూడి విద్యాసాగర్ (జిజ్జి), ఉపాధ్యక్షులుగా బొంతు రాజేంద్రప్రసాద్, పేరిచర్ల రఘురామరాజు నియమితులయ్యారు. మొత్తం 27 మందితో మండల కమిటీలను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: ఇటీవల పోతుకుర్రులో అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన కుడుపూడి సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి పుల్లంశెట్టి కుటుంబ సభ్యులు రూ.3000, పోతుకుర్రు సొసైటీ చైర్మన్ సీహెచ్ నరసింహరాజు రూ.1000 ఆర్థికసాయం అందజేశారు. ఈ సొమ్మును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా అందజేశారు.